క్లుప్తంగా

సిరుల తల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు

- రేపటి నుంచి ప్రారంభం



సిరులతల్లి కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 16న) వరలక్ష్మీ వ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుండి నెల రోజుల పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే దంపతులు రూ.400 టికెట్ రుసుం చెల్లించాలన్నారు. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం(రాగి)ని మహాప్రసాదంగా అందజేస్తామని తెలియజేశారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాలంలో ప్రత్యేక క్షీరాభిషేకం, పూజలు, వివిధ అమ్మవార్ల స్తోత్రపారాయణం, మహిళలచే సామూహిక శ్రీచక్రసహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మొదటి శుక్రవారం (ఆగస్టు 9న) అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించనున్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.34.80 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. గత నెల 12 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు రూ.34,80,944 నగదు, 115.5 గ్రాముల బంగారం, 610.5 గ్రాముల వెండితో పాటు అమెరికాకు చెందిన 247 డాలర్లు, మలేషియా దేశానికి చెందిన ఆర్ఎమ్ 11 రింగిట్స్, ఖతర్‌కు చెందిన 1 రియాల్, కువైట్‌కు చెందిన 1/4 దినార్ వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, జగన్నాథస్వామి ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



లైఫ్‌గార్డ్స్ రక్షించిన పర్యాటకులు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నలుగురు మునిగిపోతుండగా లైఫ్‌గార్డ్స్ వారి ప్రాణాలు కాపాడారు. విజయనగరం జిల్లా గరివిడి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన 15 మంది శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో తోలాడ గొల్లబాబు, కళ్యాణ కీర్తన, శోభ, కరిశెట్టి శాంతి కుమారి మునిగిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సతీష్, నూకరాజు, ఎం.చందు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, కె.రాజు వీరిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.

అటకెక్కిన అభివృద్ధి

పాతనగరంలో సమస్యలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధ్వాన రహదారులు, అపారిశుధ్యం, మురుగు, మౌలిక సదుపాయాల లేమితో ఈ ప్రాంత ప్రజలు ఆపన్నహస్తం కోసం వేచి చూస్తున్నారు. ఎన్నికలకు ముందు ఎన్నెన్నో చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు నేడు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇక్కడ ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిందే. వైఎస్సార్‌సీపీ ఓటమి తర్వాత ఇక్కడ అభివృద్ధి అటకెక్కింది. ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో ఆశలు చూపిన స్థానిక కార్పొరేటర్లు కూడా ఇప్పుడు ప్రజలకు కనిపించటంలేదు.



అధ్వానంగా రోడ్లు.. (స్టేడియం ప్రాంతం)



29వ వార్డు జిల్లా పరిషత్ సమీపాన జిల్లా మలేరియా కేంద్రం వద్ద ఇలా..

పాతనగరంలో రైతు బజారు ఎక్కడ?

పాతనగరంలో నివసిస్తున్న వేలాది కుటుంబాలకు రైతు బజార్ లేక కూరగాయలను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని 29వ వార్డులో దండుబజారు, 37వ వార్డు రెల్లి వీధి బజార్, 36వ వార్డు ప్రజలకు పూర్ణామార్కెట్, 38, 39 వార్డులకు కురుపాం మార్కెట్, 32,33 వార్డులకు అల్లిపురం బజార్ వంటివి ఉన్నాయి. ఈ మార్కెట్లలోని వ్యాపారులు జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్లో కూరగాయలు కొని లాభాలు వేసుకుని అమ్ముతుంటారు. అదే రైతుబజార్లలో అయితే రైతులు తాము పండించిన కూరగాయలను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారునికి తక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఈ సదుపాయం లేని పాతనగరవాసులు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకి కూరగాయలు కొనాల్సి వస్తోంది. ఇక్కడ అత్యధికంగా దినసరి కూలిలే నివసిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పేదలు అధిక ధరలకు కూరగాయలు కొనలేక గంజి మెతుకులతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పాతనగరంలోని ఏవీఎన్ కళాశాల డౌన్, టౌన్ కొత్తరోడ్డు, కురుపాం మార్కెట్, రీడింగ్ రూం పరిసరాల్లోని ఫుట్‌పాత్‌ల మీద కూరగాయల వ్యాపారులు కూడా అధిక ధరలకే కూరగాయలు విక్రయిస్తున్నారు. ధనికులు అధికంగా ఉండే ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు (తూర్పు నియోజకవర్గం), సీతమ్మధార, నరసింహనగర్(ఉత్తర నియోజకవర్గం) రైతు బజార్లలో సబ్సిడీ ధరలకు కూరగాయలు పొందగలుగుతున్నారు. పేదలు అధికంగా నివసించే పాతనగరంలో మాత్రం కూరలకు అధిక ధర వెచ్చించాల్సి వస్తోంది. ఇదేం చోద్యమని నియోజకవర్గ ప్రజలు వాపోతున్నారు.

- పాతనగరంలో ఎక్కడి సమస్యలు అక్కడే
- గల్లీల్లో అపారిశుధ్యం.. దోమల స్వైరవిహారం
- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ఎన్నో చెప్పిన కూటమి నేతలు నేడు కాన రారేమి

డాబాగార్డెన్స్ : పాతనగరం ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడి ప్రజలు ఎన్నో సమస్యలతో సావాసం చేస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకే ఇక్కడి సమస్యలకు చాలా వరకు పరిష్కారం దొరికింది. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్లు, ముంపు, రహదారి సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చాలా వరకు పరిష్కరించారు. ఈ ప్రాంతాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని నాటి ఎమ్మెల్యే, నియోజవకర్గ పార్టీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఎంతగానో ఆశించారు. అయితే వైఎస్సార్‌సీపీ ఓటమి తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధి అటకెక్కింది. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీసు వరకు తలపెట్టిన వన్‌టౌన్ రహదారి పనులు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు ఆగిపోయాయి. అలాగే నియోజకవర్గంలో ఇతర అభివృద్ధి పనులు కూడా స్తంభించిపోయాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచి సరిగ్గా నేటికి రెండు నెలలు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఎన్నో హామీలిచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనన్నారు.. చెత్త రహిత నియోజకవర్గమన్నారు.. అసలు సమస్యలే లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. పోర్టు కాలుష్య సమస్య తీరుస్తామన్నారు. అసెంబ్లీలోనూ ఊదరగొట్టారు. ఇలా ఒకటేంటి.. అన్ని సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేని కాసేపు పక్కన పెడితే.. వార్డుల్లో కార్పొరేటర్లు కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. వార్డుల్లో తిష్ట వేసిన సమస్యలు పరిష్కారం కావడం లేదు. వార్డు కార్పొరేటర్లు వార్డుల్లో తిరిగి సమస్యలు అడిగిన రోజులు పోయాయి. కార్పొరేటర్లు ఎక్కడా కానరావడం లేదు.



30వ వార్డు రెల్లివీధి రోడ్డు ఇలా..

నియోజకవర్గంలో సమస్యల తిష్ట..

నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. కాల్వల్లో మురుగు నీటి ప్రవాహం సరిగ్గా లేక దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



ఇలా ఉంటే విషజ్వరాలు ప్రబలవా? (పంజా జంక్షన్)

పేదల కోసం ఆలోచించాలి..



తూర్పు, ఉత్తర నియోజకవర్గంలో రెండేసి రైతు బజార్లు ఉన్నాయి. దక్షిణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలి. ఎమ్మెల్యే స్పందించాలి. నియోజకవర్గంలో పేదల కోసం పట్టించుకోవాలి. ఈ ప్రాంతంలో ఉండే వారంతా బడుగు బలహీన వర్గాల వారేనని గుర్తించాలి.

– పసగాడ రామలింగేశ్వరరావు, 29వ వార్డు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జగదాంబ : శనివారం జీవీఎంసీ 39వ వార్డు పాత పోస్టాఫీసు ఫెర్రీరోడ్డు దరి పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో శంకర్ ఫౌండేషన్, హైటెక్ వెల్ఫేర్ అధ్యక్షుడు యాసీన్ బాజ్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అంతే కాకుండా ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రుచిత, గంగాధర్, క్యాంపు అపరేటర్ వై.రాజు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం. రూ. 18.36 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సీతమ్మధార : ఆశీలమెట్టలోని శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 28 రోజులకు గాను రూ.18.36 లక్షలు, 3 గ్రాముల 320 మిల్లీగ్రాముల బంగారం, 143 గ్రాముల 400 మిల్లీగ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన 228 డాలర్లు, 551 ఖతార్ రియాన్స్, 3 మలేషియా రింగిట్స్ వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, శివజ్యోతి, శ్రీవేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, డి.ఎస్.ప్రసాద్, భక్తులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



జీవీఎంసీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట : పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఉదయం వన్‌టౌన్ (పాత పోస్టాఫీస్) పరిధిలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు పట్టీ, మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. పిల్లలకు పెట్టే భోజనం నాణ్యతను రుచి చూశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక విలువలు కలిగిన భోజనం సమకూర్చాలని, అది కూడా నిర్ణీత సమయానికి అందజేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కూడా అదేనని కలెక్టర్ గుర్తు చేశారు. కాసేపు వివిధ తరగతుల విద్యార్థులతో మమేకమైన ఆయన అక్కడ అందుతున్న విద్య గురించి, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, అక్కడి పరిస్థితులను గమనించారు. ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది, అధికారులు తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



దీక్షలో మాట్లాడుతున్న పడాల రమణ

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్ష శనివారానికి 1225వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గంగవరం పోర్టు ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయించాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.వామనమూర్తి, కోటా సత్తిబాబు, కె.సత్యనారాయణ, ప్రొఫెసర్ సూరప్పుడు, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ అభినందనీయం



అన్నదానంలో పాల్గొన్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : చిన్నతనం నుంచే సమాజ సేవ అలవరచుకునేలా వృద్ధాశ్రమంలో కుమారుడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం అభినందనీయమని దక్షిణ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. జిల్లా పరిషత్ సమీపాన గల అమెరికన్ ఆస్పత్రి ఓల్డేజ్ హోమ్‌లో సారిపల్లి సంతోష్, లక్ష్మీ మంజుల దంపతుల కుమారుడు షణ్ముఖ వేదాన్ష్ పుట్టిన రోజు వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వాసుపల్లి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి, వృద్ధులకు తన చేతుల మీదుగా భోజనం పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత, మంచి నడవడిక, సమాజ సేవ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ వేదాన్ష్ కుటుంబ సభ్యులు అప్పలకొండ, దుర్గారావు, వెంకటలక్ష్మి, గౌరీ, శ్యామల, సునీల్‌కుమార్, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, పల్లా దుర్గారావు, వార్డు నాయకులు పీతల వాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథా.. తప్పదు వ్యథ



జ్ఞానాపురం భూపేష్‌నగర్ వద్ద లీకవుతున్న మంచినీటి పైప్‌లైన్

డాబాగార్డెన్స్ : మంచినీటికి చాలా ప్రాంతాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. గుక్కెడు మంచినీటి కోసం ఎన్నో ప్రయాసలు పడ్డ రోజులున్నాయి. తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కిన రోజులెన్నో. అధికారుల పర్యవేక్షణ లోపమో.. పట్టించుకున్న నాథులు లేకనో కాన్వెంట్ జంక్షన్ నుంచి రామకృష్ణా రైతుమార్కెట్‌కు వెళ్లే రహదారి లక్ష్మీనగర్ గెడ్డ వద్ద ఓ పైపులైన్ బాగా తుప్పుపట్టడంతో విరిగింది. దీంతో నీరు వృథా అవుతూ 'సాక్షి' కంటపడింది.

కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించుకుంటేనే విశాఖ మనుగడ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార : కార్పొరేట్ శక్తుల నుంచి విశాఖ జిల్లా ప్రజలను, పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ఉద్యమాలకు ఇక్కడి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం పిలుపునిచ్చారు. భీమిలి ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలకు, కుసులువాడ మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా చేపట్టారు. దీనికి సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ విశాఖను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని గత ఇరవై ఏళ్లుగా పాలకులు చెబుతున్నా వాస్తవానికి అభివృద్ధి ముసుగులో కార్పొరేట్ శక్తులతో మైనింగ్, భూదందా వ్యాపారాలు జరుగుతున్నాయన్నారు. విశాఖ బీచ్ సీఆర్‌జెడ్ జోన్‌లో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఆనందపురం, కుసులువాడ ప్రాంతాల్లో గ్రావెల్, మైనింగ్ వంటి వాటికి కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ, ఆటవీ రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతులివ్వడాన్ని తప్పు పట్టారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వాల్లాగే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజా తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, ఆర్ఎస్ఎన్ మూర్తి, బి.రమణి, నరేంద్రకుమార్, సుబ్బారావు, పి.మణి, రాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: కొన్ని జూనియర్ కాలేజీల్లో ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో అటువంటి చర్యలకు పాల్పడిన కళాశాలలపై కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారామ్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు తెరువకూడదన్నారు. నగరంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. ఈ ఆదివారం బాలల హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం, అదే విధంగా రెండో శనివారం విద్యార్థులను కాలేజీలకు పిలిపించినట్లయితే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. సెలవు రోజైన ఆదివారం కాలేజీలు నిర్వహించడానికి వీల్లేదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ హెచ్చరించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్ట్ సంఘాల నేతలు

మహారాణిపేట : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ల ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ రూ. 1250 మెడీ క్లెయిమ్ చెల్లించాలని, జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరోతి ఈశ్వరరావు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ మాజీ చీఫ్ ఇంజినీర్‌కు ఘన సత్కారం



రవికృష్ణరాజును సత్కరిస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్ : ఇటీవల పదవీ విరమణ చేసిన జీవీఎంసీ మాజీ చీఫ్ ఇంజినీర్ రవికృష్ణరాజును కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి మాట్లాడుతూ రవికృష్ణరాజు సేవలు పలువురికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. సత్కార గ్రహీత రవికృష్ణరాజు మాట్లాడుతూ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, విధి నిర్వహణలో తనకు సహాయ సహకారాలు అందించిన ఉద్యోగస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్ ఎం. వినయ్‌కుమార్, ఎస్ఈ కేవీఎన్ రవి, అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, కన్వీనర్ రాజాన వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షులు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, జి. దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, ఆర్‌పి నాయుడు, నాగరాజు, పూర్ణచంద్రరావు, కోశాధికారి నరసింగరావు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీలు పిల్లా సూరిబాబు, ఎంవీ సత్యనారాయణ, గణేష్, టి. లక్ష్మారెడ్డి, జాయింట్ కోశాధికారి ఎ. శ్రీనివాస్, సభ్యులు సూర్యనారాయణ, రామలింగేశ్వరరావు, కన్నారావు, కృష్ణ, ఎం. రమేష్, సీహెచ్ రాజు, లింగమూర్తి, బుల్లిబాబు పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

1 నుంచి ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు



మాట్లాడుతున్న ఓబులేసు

డాబాగార్డెన్స్ : ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అల్లిపురంలో గల సీపీఐ కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఓబులేసు, సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికే పారిశ్రామిక కేంద్రంగా ఉన్న విశాఖలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు ఉక్కు నగరం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నామని, సమావేశం చివరి రోజున విశాఖ నగరంలో వేలాది మందితో కార్మిక ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల సీపీఐ కార్యదర్శులు బి. వెంకటరమణ, ఎం. పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్రావు, ఉపాధ్యక్షులు ఎస్‌కే రెహ్మాన్, కె. రామకృష్ణ, విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేగవంతంగా 'ప్రసాద్' పథకం పనులు



పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఈ పనులను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలిచారు. కొండదిగువ పుష్కరిణిసత్రం, కల్యాణమండపం, ఘాట్‌రోడ్డులో వైజంక్షన్, క్యూకాంప్లెక్స్, యాంపీ థియేటర్, అన్నప్రసాద వితరణ భవనంలో కోల్డ్ స్టోరేజీ పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను సింహగిరిపై ఆనంద నిలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో టూరిజంశాఖ ఈఈ రమణ, దేవస్థానం ఈఈలు, ఏఈ పాల్గొన్నారు. అంతకు ముందు స్వామిని కమిషనర్ సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.